కిక్కిరిసిన నల్లగొండ రైల్వేస్టేషన్

- వందే భారత్‌ను చూసేందుకు వచ్చిన జనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్-తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును శనివారం ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించారు. సికింద్రాబాద్ నుంచి బయల్దేరిన రైలును చూసేందుకు వచ్చిన జనంతో నల్లగొండ రైల్వేస్టేషన్ కిక్కిరిసింది. మధ్యాహ్న 1:37 గంటలకు రైలు నల్లగొండకు చేరుకుంది. 1:46 గంటలకు నల్లగొండ స్టేషన్ నుంచి తిరుపతికి బయల్దేరింది. మొదటిరోజు కావడంతో సెల్‌ఫోన్‌లో రైలును బంధించేందుకు, ఆగిన తర్వాత రైలు వద్ద నుంచి ఫొటోలు దిగేందుకు జనం పోటీపడ్డారు. కొంత మంది రైల్లోకి ఎక్కి లోపల ఉన్న సీట్ల తీరును, క్యాబిన్ పరిశీలించి సెల్ఫీలు దిగారు. అయితే టికెట్ రేట్లను చూసి జనం ముక్కున వేలేసుకున్నారు.

హరీశ్‌ను పరీక్షలకు అనుమతించండి

హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవల కమలాపూర్ జడ్‌పి బాలుర ఉన్నత పాఠశాల నుంచి పదో తరగతి హిందీ ప్రశ్నా పత్రం వాట్సప్‌లో చక్కర్లు కొట్టిన ఘటనలో అధికారులు డిబార్ చేసిన విద్యార్థి హరీశ్ పరీక్షలు రాసేందుకు అనుమతివ్వాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. విద్యాశాఖ అధికారుల నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హరీశ్ తండ్రి తెలంగాణ హైకోర్టులో శనివారం హౌజ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. గోడదూకి పరీక్షా కేంద్రంలోకి వచ్చిన శివకృష్ణ.. పరీక్ష రాస్తున్న హరీశ్‌ను భయపెట్టి ప్రశ్నా పత్రం తీసుకున్నాడని పిటిషన్‌లో పేర్కొన్నారు. హరీశ్ పేపర్ తీసుకుని మొబైల్‌లో ఫొటో తీసుకున్నాడని, ఆ ప్రశ్నా పత్రం వాట్సప్‌లో చక్కర్లు కొట్టిందని వివరించాడు. తన కుమారుడిని బెదిరిస్తే.. భయపడి ప్రశ్నాపత్రం ఇచ్చాడని, ఎలాంటి తప్పు చేయలేదని పిటిషన్‌లో వివరించారు. పదో తరగతి పరీక్షలు రాసేందుకు అనుమతించి, తన కుమారుడి భవిష్యత్తును కాపాడాలని కోర్టును అభ్యర్థించారు. పిటిషనర్ వాదనలు విన్న హైకోర్టు .. హరీశ్ సోమవారం నుంచి పరీక్షలకు హాజరయ్యేందుకు అనుమతివ్వాలని విద్యాశాఖను ఆదేశించింది.

విభజన హామీలు అమలు చేయని మోడీ

- తెలంగాణకు తీరని అన్యాయం చేస్తున్న కేంద్రం
- సిపిఎం నేతలు జి నాగయ్య, డిజి, జ్యోతి
- హైదరాబాద్‌లో నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణకు తీరని అన్యాయం చేస్తున్న 'ప్రధాని మోడీ గో బ్యాక్' అంటూ సిపిఎం నాయకులు, కార్యకర్తలు నినదించారు. మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లోని గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్‌టిసి క్రాస్‌రోడ్ వరకు సిపిఎం హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన ప్రదర్శనను నిర్వహించారు. 'తెలంగాణ విరోధి మోడీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం ఎక్కడ?, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలేవీ?, సింగరేణి ప్రయివేటీకరణను ఆపాలి, కేంద్ర ప్రభుత్వ విధానాలు నశించాలి' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ ప్రదర్శనకు అనుమతి లేదంటూ సిపిఎం నాయకులతో పోలీసులు వాగ్వాదానికి దిగారు. షరతులతో కూడిన అనుమతి ఇవ్వడంతో ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, టి జ్యోతి మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెలంగాణకు తీరని అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చి ఎనిమిదేండ్లు అవుతున్నా విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని చెప్పారు. మోడీ రాకను తెలంగాణ ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయకుండా గుజరాత్‌లో ఇనుప ఖనిజాన్ని అదానీకి కట్టబెట్టారని అన్నారు. ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు అవసరం లేదంటూ మోసం చేస్తున్నారని చెప్పారు. గిరిజన వర్సిటీ అడ్రస్ లేదన్నారు. విభజన చట్టంలోని హామీలను అమలు చేయని ప్రధాని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు రావడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. సింగరేణిని ప్రయివేటీకరించేందుకు కుట్ర పన్నుతున్నారని, అందుకే టెండర్లు పిలిచారని విమర్శించారు. రామగుండం ఎరువుల కర్మాగారం ప్రారంభించేందుకు వచ్చినపుడు సింగరేణిని ప్రయివేటీకరించేది లేదంటూ ప్రధాని హామీనిచ్చారని గుర్తు చేశారు.

నిత్యావసర వస్తువుల ధరలను విపరీతంగా పెంచటంతో సామాన్యులు విలవిల్లాడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక హక్కులను మోడీ కాలరాస్తున్నారని, ఫెడరల్ వ్యవస్థకు తూట్లు పొడుస్తున్నారని అన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలన్న మోడీ ఈ తొమ్మిదేండ్లలో 18 కోట్ల మందికి ఉద్యోగాలివ్వాల్సి ఉందన్నారు. కానీ 18 లక్షల మందికి కూడా ఉద్యోగాలివ్వలేదని ఎద్దేవా చేశారు. ఇంకోవైపు ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తూ, కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని చెప్పారు. ఎయిర్‌పోర్టులు, గనుల, సహజ వనరులను అదానీకి అప్పగిస్తున్నారని అన్నారు. ప్రధాని మోడీ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. మోడీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశాన్ని రిటైల్‌గా అమ్ముకుంటారని అన్నారు. నిరంకుశ విధానాలను అవలంభిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు. సిపిఎం హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బి రవికుమార్, ఆర్ శ్రీరాం నాయక్, టి స్కైలాబ్‌బాబు, జె బాబురావు, బి ప్రసాద్, ఎం అడివయ్య, నగర నాయకులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లీగల్ నోటీసు వెనక్కి తీసుకోకపోతే క్రిమినల్ చర్యలు

- కెటిఆర్‌కు రేవంత్ సమాధానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ఐటి, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ పంపిన లీగల్ నోటీసుపై టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి స్పందించారు. లీగల్ నోటీసును వెనక్కి తీసుకోకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటానని శనివారం కౌంటర్ సమాధానం పంపారు. గత నెల 28న రేవంత్‌రెడ్డికి మంత్రి కెటిఆర్ లీగల్ నోటీసు పంపారు. ప్రతిగా రేవంత్‌రెడ్డి ఏడు పేజీల సమాధానమిచ్చారు. 'మీ క్లయింట్ సరైన వివరాలు మీకు అందించలేదు. మీడియా సమావేశంలో మాట్లాడిన వీడియో సరిగా వినపడట్లేదు' అని లేఖలో పేర్కొన్నారు. ఇంకా పలు అంశాలతో కూడిన కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమమే ఉద్యోగాల కేంద్రంగా జరిగిందని, తెలంగాణ ఉద్యమంతో కెటిఆర్‌కు సంబంధం లేదని.. ఈ దేశంలో లేనందున ఆ బాధ తెలియదన్నారు. టిఎస్‌పిఎస్‌సి ఉద్యోగాల విషయంలో నిరుద్యోగుల తరఫున మాట్లాడానని తెలిపారు. టిఎస్‌పిఎస్‌సి సాంకేతిక పరిజ్ఞానం మొత్తం ఐటీశాఖ అందిస్తుందని, అలాంటప్పుడు కెటిఆర్ తనకు సంబంధం లేదని ఎలా చెబుతారని ప్రశ్నించారు. నేరారోపణలు ఎదుర్కొంటున్న రాజశేఖర్‌రెడ్డి నియామకం కూడా ఐటీశాఖ ద్వారానే జరిగిందని రేవంత్‌రెడ్డి వివరించారు. "పేపర్ లీక్.. పేపర్ అవుట్‌కు తేడా ఉంది. టిఎస్‌పిఎస్‌సి పేపర్ లీక్ అయింది. ఎస్-ఎస్‌సి పేపరు అవుటయింది. బండి సంజయ్ కుట్ర నిజమైతే బెయిల్‌పై ప్రభుత్వం కోర్టులను ఎందుకు ఆశ్రయించలేదు. బిజెపి, కెసిఆర్ ఒప్పందంలో భాగంగానే ఈ డ్రామా. వెంటనే టిఎస్‌పిఎస్‌సి బోర్డును రద్దు చేసి పరీక్షలు పెట్టాలి. సిట్ అధికారులు అసలు దొంగలను పట్టుకోవాలి. నిందితులు వేరు.. సాక్షులు వేరు. చైర్మన్, కార్యదర్శి, సభ్యులను సాక్షులుగా పిలిచి అడుగుతున్నారు. కాన్ఫిడెన్షియల్ విషయాలు కెటిఆర్‌కు ఎలా తెలుస్తున్నాయి.. సిట్ అధికారులు చెబుతున్నారా" అనే అనుమానం వ్యక్తం చేశారు.

24 గంటలూ షాపులు తెరిచే ప్రతిపాదన వద్దు

ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 24 గంటలపాటు షాపులు తెరిచే ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం, ఉపాధ్యక్షులు ఎస్‌ఎల్ పద్మ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వ్యాపారస్తులకు, యాజమాన్యాలకు మాత్రమే ప్రభుత్వ నిర్ణయం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల కార్మికులకేం ఉపయోగమని ప్రశ్నించారు. వివిధ షాపుల్లో పనిచేస్తున్న అనేక మంది కార్మికులకు కనీస వేతనాల చట్టం అమలు కావడం లేదని తెలిపారు. ఉద్యోగ భద్రత లేదని పేర్కొన్నారు. వారికి ఎలాంటి చట్టబద్ద హక్కులు అమలు కావటంలేదని పేర్కొన్నారు. పీఎఫ్, ఈఎస్‌ఐ లాంటి సౌకర్యాలు అమలు కావటం లేదని తెలిపారు.

తమిళనాడులో అలా.. తెలంగాణలో ఇలా..

- ఎందుకీ వేర్వేరు నిబంధనలు?
- తమిళనాడు బొగ్గు గనులను వేలం నుంచి తొలగించడంపై కెటిఆర్ ట్వీట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమిళనాడులోని బొగ్గు గనులను వేలం జాబితా నుంచి కేంద్రం తప్పించిందని రాష్ట్ర మంత్రి కెటిఆర్ గుర్తు చేశారు. సింగరేణి కాలరీస్ విషయంలోనూ తాము ఇదే డిమాండ్ చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలోని నాలుగు బొగ్గు గనులను వేలం నుంచి తప్పించాలని కోరారు. వాటిని ప్రయివేటీకరించకుండా సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ట్వీట్ చేస్తూ.. తమిళనాడులోని గనులను వేలం జాబితా నుంచి కేంద్రం తప్పిస్తున్నట్టు ఓ ఆంగ్ల పత్రిక రాసిన వార్తను పోస్టుకు జత చేశారు. ఈ క్రమంలో ఒకే దేశంలో ఉన్న రాష్ట్రాలకు వేర్వేరు నిబంధనలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. కాగా ప్రభుత్వం లేదా ప్రయివేటు కంపెనీలు ఏవైనా సరే వేలంలో టెండర్లు దాఖలు చేసి బొగ్గు గనులు సొంతం చేసుకోవాల్సిందేనని కేంద్రం మరోసారి స్పష్టం చేసిన విషయం తెలిసిందే. అయితే గనులను స్వచ్ఛందంగా సింగరేణికే కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేస్తున్న సంగతి విదితమే. తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లోని 101 బొగ్గు గనులను వేలం వేయడానికి గత నెల 29న కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ గనులపై ఈ నెల 12న ప్రీ బిడ్ సమావేశం నిర్వహిస్తామనీ, ఆసక్తి గల ప్రభుత్వ లేదా ప్రయివేటు కంపెనీలు హాజరై టెండరు ప్రక్రియ వివరాలు తెలుసుకోవాలని కేంద్ర బొగ్గుశాఖ తాజాగా మరో నోటిఫికేషన్ జారీచేసింది. ఈ క్రమంలో కేంద్రం విధానాలను తప్పుబడుతూ కెటిఆర్ ట్వీట్ చేశారు.

రూ.10కోట్లతో నేచర్ క్యూర్ ఆస్పత్రి

- ప్రారంభించిన స్పీకర్ పోచారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రూ.10 కోట్లతో నేచర్ క్యూర్ ఆస్పత్రిని అభివృద్ధి చేయడం గొప్ప విషయమని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం నేచర్ క్యూర్ ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1949లోనే ఏర్పాటు చేసిన ఈ ఆస్పత్రి ఆదరణకు నోచుకోక, నాటి ప్రభుత్వాలు పట్టించుకోక పేషెంట్లు ఇబ్బంది పడేవారని, సిఎం కెసిఆర్ ఆదేశాలతో మంత్రి హరీశ్‌రావు ఈ ఆస్పత్రిని అద్భుతంగా తీర్చదిద్దారన్నారు. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ' రూ.10కోట్లతో ఈ ఆస్పత్రిని అభివృద్ధి చేసుకున్నాం. ఇంకా నిధులు ఇస్తాము. సిఎం కెసిఆర్ ప్రకృతి వైద్యానికి రాష్ట్రాన్ని కేరాఫ్ అడ్రస్‌గా నిలిచేలా కృషి చేస్తున్నారు ' అని అన్నారు. కొత్తగా అభివృద్ధి చేసుకున్న ఈ ఆస్పత్రిని ప్రారంభించుకోడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలో 834 ఆయుష్ డిస్పెన్సరీలు, 5 కాలేజీలు, 4 రీసెర్చ్ హాస్పిటల్స్ ఉన్నాయి.

వికారాబాద్, భూపాలపల్లి, సిద్ధిపేటలో 50 పడకల కొత్త ఆయుష్ ఆస్పత్రుల నిర్మాణాలు జరుగుతున్నాయని అన్నారు. నేచర్ క్యూర్ ఆస్పత్రిలో తాను కొన్ని రోజులు పేషెంట్‌గా ట్రీట్‌మెంట్ తీసుకున్నానని మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ అన్నారు. వికారాబాద్‌లో ఇలాంటి ఆస్పత్రిని డెవలప్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎంపి కేశవరావు, సీఎస్ శాంతి కుమారి, హెల్త్ సెక్రెటరీ రిజ్వి, టి ఎస్‌ఎంఎస్ ఐడిసి చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఆయుష్ కమిషనర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ రీడర్లకు భాషపై స్పష్టత అవసరం

- జస్టిస్ రామలింగేశ్వర రావు

ప్రజాశక్తి - కల్చరల్

తెలుగు చానెళ్లలోని న్యూస్ రీడర్లకు భాషపై స్పష్టత ఉండాలని, ఆంగ్ల పదాలు అధికంగా వాడరాదని సమైఖ్య ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ.రామలింగేశ్వరరావు సూచించారు. శ్రీ త్యాగరాయ గాన సభ ప్రధాన వేదికపై ఆరాధన సాంస్కృతిక సంస్థ నిర్వహణలో టివి న్యూస్ ప్రెజంటర్లకు జీవిత సాఫల్య పురస్కార ప్రధానోత్సవ సభ శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ రామ లింగేశ్వరరావు పాల్గొని పురస్కారాలు బహూకరించి మాట్లాడారు. పురస్కార గ్రహీతలకు బాధ్యత మరింత పెరిగిందన్నారు. సాహితీవేత్త వోలేటి పార్వతీశం మాట్లాడుతూ ఆకాశవాణీ తొలి రోజుల్లో తెలుగులో వార్తలు జగ్గయ్య, మామిళ్లపల్లి రాజ్యలక్ష్మి, పి.ఎస్.ఆంజనేయశాస్త్రి వంటి మహామహులు చదివే వారని, వారి భాష ఉచ్చారణ గమనించాలని కోరారు. కళాభిమాని హనుమంతరావు అధ్యక్షత వహించిన సభలో చిల్ల రాజశేఖరరెడ్డి, ఫారీద్‌బాబు, లంకా లక్ష్మీనారాయణ, శైలజ తదితరులు పాల్గొనగా సంస్థ కార్యదర్శి లోకం కృష్ణయ్య స్వాగతం పలికారు. పురస్కారాలు అందుకొన్న వారిలో ఎబిఎన్ కాంతి కిరణ్, సాక్షి అనుశ్రీ, యాదగిరి దూర్ దర్శన్ గౌతమ్ కుమార్, 10 టి.వి సుమలత, టి న్యూస్ కవితారెడ్డి తదితరులు ఉన్నారు.

చంద్రబోస్‌ను సత్కరించిన వినోద్, తదితరులు

సాంస్కృతిక సాధికారత కావాలి

- వినోద్ కుమార్

ప్రజాశక్తి - కల్చరల్

తెలంగాణ సాధించుకున్న తరువాతే మన భాష, యాసకు గుర్తింపు వస్తుందని రాష్ట్రంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్ కుమార్ అన్నారు. ఆర్థిక సాధికారితమాత్రమే కాదని, జాతి గుర్తింపునకు సాంస్కృతిక సాధికారికత సాధించాలని ఆయన కోరారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర సంగీత నాటక అకాడమీ నిర్వహణలో యవనిక పేరిట జరుగుతున్న నాటికోత్సవాలలో భాగంగా ఆస్కార్ అవార్డ్ అందుకొన్న గీత రచయిత చంద్రబోస్‌కు సత్కార సభ జరిగింది. చంద్రబోస్ మాట్లాడుతూ 95 సంవత్సరాల ఆస్కార్ చరిత్రలో తొలిసారిగా వినిపించిన తెలుగు పదం నమస్తే, పాట పాదం పొలమని, రెండూ దేశ సంస్కృతికి.. తెలుగు జాతి సంప్రదాయానికి ప్రతీకలని అన్నారు. భాష తెలియకున్నా ఇతర దేశాలవారు నాటు నాటు పాటకు నృత్యం చేశారని, ఇందుకు కారణం నాద మాధుర్యం అన్నారు. మూడు వేలకుపైగా పాటలు రాసి జాతీయ పురస్కారం కోసం ఎదురుచూసిన నాకు ఆస్కార్ రావడం అద్భుతమని తెలిపారు. యువత నిరాశపడకుండా కృషి చేస్తే ఫలితం తప్పక లభిస్తోందని అన్నారు. వేదికపై సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, అకాడమీ చైర్మన్ దీపికారెడ్డి పాల్గొన్నారు. రచయిత్రి ఇనాంపూడి శ్రీలక్ష్మి సన్మాన పత్రంలో చంద్రబోస్ కవిత్వం ఆవిష్కరించారు. విశ్వశాంతి కల్చరల్ వారిచే బిఎమ్ రెడ్డి దర్శకత్వంలో కలనేత నాటిక అజయ్ దర్శకత్వంలో ఆల్ఫా నాటిక ప్రదర్శించారు.

నేడే సిపిఎం, సిపిఐ సంయుక్త సమావేశం

- ముఖ్యఅతిథులుగా ఏచూరి, రాజా, రాఘవులు, నారాయణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం, సిపిఐ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సంయుక్త సమావేశం జరగనుంది. సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, జాతీయ కార్యదర్శులు కె నారాయణ, సయ్యద్ అజీజ్‌పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథులుగా హాజరవుతారు. ఈ సమావేశంలో ఆ రెండు పార్టీల మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులతోపాటు ప్రజాసంఘాల రాష్ట్ర నాయకులంతా పాల్గొంటారు. ఇలాంటి సంయుక్త సమావేశాన్ని నిర్వహించడం తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. అందుకే ఈ సమావేశం ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నది.

సిపిఎం, సిపిఐ మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నాయకులను మరింత ఐక్యం చేసేందుకే దీన్ని నిర్వహిస్తున్నారు. దీంతో ఉభయ కమ్యూనిస్టు పార్టీల మధ్య ఐక్యత బలపడుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ, కార్పొరేట్లకు రాయితీలు, సామాన్యులపై భారాలు మోపే మోడీ ప్రభుత్వాన్ని ఎండగట్టడంతోపాటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బిఆర్‌ఎస్ పట్ల ఎలాంటి వైఖరి అవలంభించాలనే దానిపైనా కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్నారు. ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ పరిశీలించారు.

విశాఖ పర్యటనకు రండి

- సిఎం కెసిఆర్‌కు విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ ఆహ్వానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ కోసం కార్మికులు చేపట్టిన పోరాటానికి బిఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. విశాఖ పర్యటనకు రావాలంటూ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు ఆహ్వానం లభించింది. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్‌తో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సహా ప్రతినిధులు శనివారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. ఆ కమిటీ చైర్మన్ ఎం.రాజశేఖర్, కో కన్వీనర్ నీరుకొండ రామచంద్రరావు, ప్రతినిధి మంత్రి మురళీకృష్ణారావు పాల్గొన్నారు. పలు అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ సుమారు రూ.4 లక్షల కోట్లు విలువ చేసే ఆస్తులు కలిగిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని నిర్వీర్యం చేసి దాన్ని ప్రయివేటు సంస్థకు అప్పనంగా ధారాదత్తం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని, జాతి సంపద అయిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఉద్యమానికి బిఆర్‌ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ కమిటీ ఆహ్వానాన్ని సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చారు.

అభివృద్ధా? రాజకీయానికా..?

- ప్రధానిని ఉద్దేశించి మంత్రి హరీశ్ ఎద్దేవా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి విచ్చేసిన ప్రధాని మోడీ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయడానికి వచ్చినట్టుగా లేదనీ, తమ ప్రభుత్వాన్ని తూలనాడటానికే ఆయన వచ్చారని ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. 'మీరు అభివృద్ధి పనుల కోసం వచ్చారా..? లేక రాజకీయానికా..?' అని మోడీని ప్రశ్నించారు. తెలంగాణపై ప్రధాని తన కడుపులోని విషాన్ని మొత్తం కక్కారని పేర్కొంటూ ట్వీట్ చేశారు. 'పర్యటన సందర్భంగా మోడీ మాట్లాడిన ప్రతీ మాటా సత్య దూరం. ప్రధానిగా ఇన్ని అబద్ధాలాడటం ఆయనకే చెల్లింది...' అంటూ విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచీ ఆసరా పెన్షన్లు, రైతు బంధు లాంటివి నేరుగా లబ్దిదారుల ఖాతాలో జమవుతున్నాయి. ఈ వాస్తవాలను మరుగుపరిచిన పీఎం... తన వల్లే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ- నేరుగా లబ్దిదారుల ఖాతాల్లోకే నగదు బదిలీ) మొదలైనట్టు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. ఇందులో మోడీ గొప్పలు చెప్పుకోవాల్సింది ఏముందంటూ ప్రశ్నించారు.

'రైతుబంధును కాపీ కొడితే పీఎం కిసాన్ అయ్యింది. అయినా ఆ పథకం వల్లే మొదటిసారి రైతులకి లబ్ది చేకూరిందంటూ ప్రధాని చెప్పుకోవడం సిగ్గు చేటు. రైతు బంధుతో పోల్చితే పీఎం కిసాన్ సాయమెంత..? వ్యవసాయానికి, పరిశ్రమలకు కేంద్రం చేయూత అని చెప్పటం పూర్తి అవాస్తవం. ఐటీఐఆర్‌ను బెంగళూర్‌కు తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడ అర్బిట్రేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన వెంటనే గుజరాత్‌లో అలాంటి సెంటర్‌నే ఏర్పాటు చేశారు. తెలంగాణలో ధాన్యాన్ని కొనకుండా రైతుల కంట కన్నీరు పెట్టించారు. ఇవన్నీ చేసింది మీ ప్రభుత్వం కాదా మోడీ గారు...' అంటూ హరీశ్‌రావు ప్రశ్నించారు. 'అదానీ వాదం గురించి ప్రజల దృష్టిని మళ్లించటానికి వీలుగా.. లేని పరివారవాదం గురించి మాట్లాడడం మీకే చెల్లింది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సహకరించటం లేదంటూ ప్రధాని చెప్పడం హాస్యాస్పదం. నిజానికి ఈ పరిస్థితి రివర్స్‌గా ఉంది. రాష్ట్రానికి రావాల్సిన గిరిజన యూనివర్సిటీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, మెడికల్ కాలేజీలు, నర్సింగ్ కాలేజీలు, జాతీయ హోదా వంటి వాటిని ఇవ్వకుండా కేంద్రమే తెలంగాణకు సహాయ నిరాకరణ చేస్తోంది...' అని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నీ అబద్ధాలే...

మోడీ ప్రసంగంపై మంత్రి వేముల

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ప్రధాని మోడీ రాష్ట్రానికొచ్చి అసత్యాలు, అబద్ధాలే మాట్లాడారని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. తల్లిని చంపి బిడ్డను బతికించారంటూ పార్లమెంట్ వేదికగా మాట్లాడిన మోడీ... తెలంగాణ ప్రజల మీద తనకు ప్రేమ ఉందంటే నమ్మగలమా? అని ఒక ప్రకటనలో ప్రశ్నించారు. పసుపు బోర్డు ఇస్తామంటే అడ్డుకున్నామా? బాండ్ పేపర్ రాసిచ్చి ఐదు రోజుల్లో తెకుంటే రాజీనామా చేస్తానన్న ఎంపి అర్వింద్ రాజీనామాను అడ్డుకున్నమా? అని ప్రశ్నించారు. బిజెపి హయాంలో కార్పొరేట్ల బినామీల పాలన కొనసాగుతున్నదని విమర్శించారు. మోడీ సచ్చీలుడైతే అదానీపై ఇడి, సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కిసాన్ సమ్మాన్ నిధిని ప్రారంభించినప్పుడు ఎంత మందికి ఆ పథకం కింద డబ్బులు ఇచ్చారో, ఇప్పుడు ఎంతమందికి ఇస్తున్నారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ముమ్మరంగా కంటి వెలుగు శిబిరాలు.....

- రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికి పరీక్షలు .
- 16,33,988 మందికి కళ్లద్దాల పంపిణీ..
- సమాచార, పౌర సంబంధాలశాఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రజల జీవితాలలో కొత్త కాంతులు వస్తున్నాయి. కంటి సమస్యలతో బాధపడే వారి ఇబ్బందులను తొలగించేందుకు సిఎం కెసిఆర్ ప్రారంభించిన ఆయా శిబిరాలను రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ మేరకు శనివారం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ కమిషనర్ అర్వింద్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. కంటి పరీక్షలు చేయించుకునేందుకు నగరాలు, పట్టణాలకు, ఆస్పత్రులకు వెళ్లే అవసరం లేకుండా గ్రామీణ ప్రాంతాల్లో జనావాసాల వద్ద శిబిరాలు నిర్వహించడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాల్లో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు క్యాంపులకు యువతీ, యువకుల నుంచి వృద్ధుల వరకు అన్ని వర్గాల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నది. కంటి వెలుగు క్యాంపుల నిర్వహణలో ప్రజా ప్రతినిధులు, అధికారులు చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ప్రజలు కంటి వెలుగు క్యాంపుల వద్ద సకాలంలో చేరుకునే విధంగా ముందస్తుగా అవగాహన కల్పించి తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తూ క్యాంపు జయప్రదమయ్యేలా కృషి చేస్తున్నారు. కంటి పరీక్షల నిర్వహణలో వచ్చే ఖర్చుకు భయపడో, అవగాహనలేకో పరీక్షలు చేయించుకోని వారికి ఈ కార్యక్రమం ఒక వరంలా మారిందనీ, ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు అందించడంతో ప్రజలు సంబరపడుతున్నారని అర్వింద్ కుమార్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాల్లో ఉన్న బఫర్ బృందాలతో ఉద్యోగులకు, జర్నలిస్టులకు, పోలీసులకు, న్యాయవాదులకు, వివిధ వర్గాల వారికి ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

మళ్లీ మోడీ మొండిచేయి చూపారు

- ప్రధాని ప్రసంగంపై బోయినపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర పర్యటన ద్వారా ప్రధాని మోడీ మనకు మళ్లీ మొండిచేయి చూపారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు మోడీ ప్రసంగంపై శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధాని రాష్ట్రంపై ఆక్రోశం వెళ్లగక్కారే తప్ప... ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. కొత్త రాష్ట్రం సాధించిన ప్రగతిపై ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న 14 జాతీయ రహదారులను మంజూరు చేస్తారని ఆశించామనీ, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ప్రకటిస్తారని విశ్వసించామన్నారు. అవేవీ ప్రకటించని ప్రధాని... సిఎం కెసిఆర్, వారి కుటుంబ సభ్యులపై విమర్శలు చేసేందుకే ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. వందే భారత్ రైలును ఎన్ని సార్లు ప్రారంభిస్తారంటూ ప్రశ్నించారు.

IN THE HONBLE COURT OF THE IV ADDL. JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT AT :: L B NAGAR

O.S. No.**1043** OF **2022**

Between:
State Bank of India, Hastinapuram Branch,Nagarjuna Colony, Ranga Reddy.
... Plaintiff

AND

Baireddy Venkat Venkatreddy
... Defendant

To
Baireddy Venkat Venkatreddy S/o Baireddy Laxma Reddy P. No.79, Bupesh gupta Nagar, Diamond Colony, Karman ghat, Saroornagar, Ranga Reddy Dist. - 500 020.

Please take notice that as you are evading taking notices sent by the Hon'ble Court, notice to you in this daily has been ordered by the Hon'ble Court and you are hereby directed to appear either in person or through duly instructed Advocate at **10-30** AM on **17-04-2023** in the above mentioned Court or else the matter will be determined on the basis of the available material without any further notice to you as ordered by the Court.

SMT. RAPAKA ARUNA, B.A, B.L.,
Advocate
11-78, Flat No.203,
Sri SaiManssion,Pragathinagar,

యునిగేజ్ పరీక్షలకు దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్ : కొమెడ్కె యుజిఇటి, యునిగేజ్ ప్రవేశ పరీక్షల దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపింది. కర్నాటక అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల అసోసియేషన్ గుర్తింపు కలిగిన ఈ సంస్థ అక్కడి బిఇ, బిటెక్ కాలేజీల్లో ప్రవేశాలకు యునిగేజ్ పరీక్షను నిర్వహిస్తుంది. ఈ ఏడాది 400 కేంద్రాల్లో లక్ష మంది విద్యార్థులు హాజరు కావొచ్చని అంచనా వేస్తుంది. 2023 ఏప్రిల్ 24 వరకు దరఖాస్తులు స్వీకరించి.. మే 28న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపింది.

ఎంసెట్‌కు 2.83 లక్షల దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, బిఎస్‌సి నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎంసెట్‌కు భారీగా దరఖాస్తులొస్తున్నాయి. ఇప్పటి వరకు 2,83,128 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని ఎంసెట్ కన్వీనర్ డీన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలస్య రుసుం లేకుండా దరఖాస్తుల సమర్పణకు తుది గడువు సోమవారం వరకు ఉందని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ విభాగానికి 1,81,693 మంది, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 1,01,138 మంది, రెండు విభాగాలకు 297 మంది కలిపి మొత్తం 2,83,128 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. వచ్చేనెల 10,11 తేదీల్లో ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం, అదేనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

11న జ్యోతిబాఫూలే 197వ జయంతి

- పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతిబాఫూలే 197వ జయంతి వేడుకల పోస్టర్‌ను మంత్రులు గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, వి.శ్రీనివాస్ గౌడ్ ఎమ్మెల్సీలు ఎగ్గె మల్లేశం, ఎల్. రమణ, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తదితరులు ఉత్సవ కమిటీ ప్రతినిధుల సమక్షంలో అసెంబ్లీ ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈనెల 11న ఉదయం 10 గంటల నుంచి రవీంద్రబారతిలో నిర్వహించే ఈ జయంతి వేడుకలకు అందరూ హాజరై విజయవంతం చేయాలని మంత్రులు పిలుపునిచ్చారు.

మోడీ హఠావో.. సింగరేణి బచావో..

- సింగరేణిప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికుల మహాధర్నా
- మోడీకి వ్యతిరేకంగా నినాదాలు
- కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా మహాధర్నా చేపట్టాయి. ప్రధాని మోడీ హైదరాబాద్ పర్యటనను వ్యతిరేకిస్తూ సింగరేణి వ్యాప్తంగా కార్మికులు ఆందోళనలు నిర్వహించారు. మోడీ హఠావో సింగరేణి బచావో అంటూ నినాదాలు చేశారు. రాష్ట్రంపై ప్రధాని సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిఆర్‌ఎస్ పార్టీ పిలుపు మేరకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సింగరేణి వ్యాప్తంగా కార్మికులు మహాధర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు.

భూపాలపల్లి, కొత్తగూడెం, మంచిర్యాల, గోదావరిఖని, రామగుండం, మందమర్రి, నస్పూర్, ఇల్లందులో ధర్నాకు దిగారు. బొగ్గు బ్లాకుల ప్రయివేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గోదావరిఖనిలో టిబిజికెఎస్ నేత కెంగర్ల మల్లయ్య ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్‌లపై టిబిజికెఎస్ ఆధ్వర్యంలో సింగరేణి కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. భూపాలపల్లిలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. సింగరేణిని ప్రయివేటీకరణ చేసేందుకు కేంద్రం యత్నిస్తోందని మంత్రి ఎర్రబెల్లి అన్నారు. సింగరేణి ప్రయివేటీకరణ ఆపే వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. పేదల పొట్టకొట్టి పెద్దలకు పంచడమే మోదీ విధానమని విమర్శించారు.

సింగరేణి ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మికులతో కలిసి కొత్తగూడెంలో బిఆర్‌ఎస్ మహాధర్నా నిర్వహించింది. మంత్రి పువ్వాడ అజయ్, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఎంపి వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు వనమా, సండ్ర వెంకట వీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, కందాల ఉపేందర్ రెడ్డి, రాములు నాయక్ ధర్నాలో పాల్గొని నిరసన తెలిపారు. మోదీ హటావో.. సింగరేణి బచావో అంటూ కార్మికులు నినదించారు.

పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని చౌరస్తాలో నిర్వహించిన మహాధర్నాలో మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే కోరుకంటి చందర్, టిబిజికెఎస్ నాయకులు పాల్గొన్నారు. తెలంగాణకు ఒక్క రూపాయి ఇవ్వని మోదీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఇచ్చిన మాట నిలుపుకోని మోదీకి తెలంగాణలో తిరిగే హక్కు లేదని నినాదాలు చేశారు. మంచిర్యాలలోని నస్పూర్ చౌరస్తాలో సింగరేణి కార్మికులు, టిబిజికెఎస్ సంఘం నేతలు పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఇందులో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్యే జోగు రామన్న, రాథోడ్ బాపూరావు, ఆత్రం సక్కు, దుర్గం చిన్నయ్య, దివాకర్ రావు పాల్గొన్నారు.

11 నుంచి విధుల బహిష్కరణ

నల్లబ్యాడ్జీలతో జూడాల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపకారవేతనాలను 15 శాతం వరకూ పెంచాలనీ, వాటిని రెగ్యులర్‌గా అందజేయాలని తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజూడా) డిమాండ్ చేసింది. ప్రతి పీజీ విద్యార్థికి డిస్ట్రిక్ట్ రెసిడెన్సీ ప్రోగ్రాం (డీఆర్ పీ) అమలు చేయాలని కోరింది. ఈ మేరకు శనివారం ఉస్మానియా, గాంధీ ఆస్పత్రితో పాటు రాష్ట్రంలోని ఆస్పత్రుల్లో టీజూడా ఆధ్వర్యంలో జూనియర్ డాక్టర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షులు డాక్టర్ కౌశిక్ కుమార్ మాట్లాడుతూ.. నల్ల బ్యాడ్జీల నిరసనను ఈ నెల 10 వరకు కొనసాగిస్తామనీ, అప్పటికీ ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుంటే అత్యవసర సేవలు మినహా అన్ని రకాల వైద్య సేవలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. డీఆర్‌పీకి హాజరై వైద్య సేవలు అందించే పీజీ విద్యార్థులకు సరైన పరిశుభ్రమైన వసతి , భద్రత (ముఖ్యంగా మహిళా పీజీలకు), ఆహార సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు.

సామాజిక రంగాలకు నిధులు విడుదల చేయండి

- కుల నిర్మూలన వేదిక డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్షేమ హాస్టళ్లకు వివిధ వస్తువులను సరఫరా చేసే వారికి గత ఏడాది బడ్జెట్ ఇంకా విడుదల కాలేదనీ, తక్షణం ఆ నిధులను విడుదల చేయాలని కుల నిర్మూలన వేదిక రాష్ట్ర కార్యదర్శి పాపని నాగరాజు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థులకు మంత్రులు, అధికారుల కమిటీ 25 శాతం మెస్‌చార్జీలు పెంచాలంటూ సూచించిందని తెలిపారు. 3-7 తరగతులకు రూ.1,200, 8-10 తరగతులకు రూ.1,400, ఇంటర్మీడియట్ నుంచి పిజి వరకు రూ.1,875 రూపాయలు ఇవ్వాలనే ప్రతిపాదనతో సిఎం అమోదం కోసం పంపించామంటూ పేపర్లలో ప్రకటించి నెల రోజులైందని తెలిపారు. అయినా ఇంతవరకు జిఒ విడుదల కాలేదని పేర్కొన్నారు. బిసి సంక్షేమ శాఖ నిర్వహించే అనేక రకాల కార్పొరేషన్లకు, ఫెడరేషన్లకు, సంక్షేమ హాస్టళ్లకు నిధులను విడుదల చేయకపోవడం పట్ల ఆయా సామాజికవర్గాలు ఆర్థికంగా, సామాజికంగా, సాంస్కృతికంగా ముందు వరుసలో నిలబడకుండా వెనకడుగు వేస్తున్నాయని తెలిపారు.

సహకార వ్యవస్థ రక్షణ కోసం ఐక్య ఉద్యమాలు

- వ్యవసాయ కో-ఆపరేటివ్ ఎంప్లాయీస్ యూనియన్ మహాసభలో సాగర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల సహకార వ్యవస్థకు ప్రమాదం ఏర్పడిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ ఆందోళన వ్యక్తం చేశారు. సహకార వ్యవస్థ రక్షణ కోసం ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ స్టేట్ వ్యవసాయ కో ఆపరేటివ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర మహాసభ ఎండి సర్దార్ అధ్యక్షతన శనివారం జరిగింది. మహాసభ ప్రారంభోత్సవం సందర్భంగా సాగర్ మాట్లాడుతూ కేంద్రం సహకార రంగాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. రాష్ట్రాల హక్కులను కాలరాసేలా నిర్ణయం తీసుకుంటున్నదని తెలిపారు. బడా పెట్టుబడిదారులకు వ్యవసాయ రంగాన్ని అప్పజెప్పేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. మల్టీస్టేట్ లెవెల్ కో ఆపరేటివ్ సొసైటీ చట్టాన్ని తీసుకొచ్చి సహకార సంఘాలన్నిటిని ప్రయివేటుపరం చేసేలా పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెట్టిందన్నారు. సహకార సంఘం ఉద్యోగులు, రైతులు ఐక్యంగా ఆ విధానాలను తిప్పి కొట్టాల్సిన అవసరముందని తెలిపారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, యూనియన్ గౌరవాధ్యక్షులు కె.భూపాల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని విమర్శించారు. సహకార సంఘాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. జిఒ నెంబర్ 44లోని లోపాలను సవరించి తద్వారా ఉద్యోగులకు అందాల్సిన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి పి ఈశ్వర్‌గౌడ్ కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టారు. సహకార రంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. సంఘాన్ని బలోపేతం చేయడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. యూనియన్ ఆర్థిక నివేదికను పి నరేందర్‌రెడ్డి ప్రవేశ పెట్టారు. వివిధ జిల్లాల నుంచి హాజరైన ప్రతినిధులు పలు సూచనలు చేశారు. అనంతరం మహాసభ భవిష్యత్తు కర్తవ్యాలను నిర్దేశించుకుంది. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. గౌరవాధ్యక్షులుగా కె.భూపాల్, అధ్యక్షులుగా ఎండి సర్దార్, ప్రధాన కార్యదర్శిగా పి.ఈశ్వర్‌గౌడ్, కోశాధికారిగా ఈశ్వరప్ప, ఉపాధ్యక్షులుగా రాందాస్, నరేందర్‌రెడ్డి, వెంకటస్వామి, సహాయ కార్యదర్శులుగా నిసార్ అహ్మద్, యు.రవీందర్, బి.గణేష్, కార్యవర్గ సభ్యులుగా వెంకట్‌రెడ్డి, కేశవరెడ్డిని మహాసభ ఎన్నుకుంది.

హిమాయత్‌నగర్‌లోని 'మలబార్' పునఃప్రారంభం

హైదరాబాద్ : ప్రముఖ బంగారు, వజ్రాభరణాల రిటైల్ వ్యాపార సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తన హిమాయత్‌నగర్‌లోని స్టోర్‌ను పునరుద్ధరించింది. శనివారం ఈ స్టోర్‌ను హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయ లక్ష్మీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు సిరాజ్ పికె, నయిమ్, శరీజ్ కె, షానబ్ కె తదితరులు పాల్గొన్నారు. పునరుద్ధరించబడిన నూతన స్టోర్‌లో ప్రతి రూ.30,000 కొనుగోలుపై 100 మిల్లీ గ్రాముల బంగారు నాణేనికి సమానమైన విలువను అందించనున్నట్లు తెలిపింది. ఈ ఆఫర్ మార్చి ఏప్రిల్ 30 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపింది.

ప్రీప్రైమరీ తరగతులకు గ్రాంటు ఇవ్వండి

- ప్రధాని మోడీకి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతుల (ప్రీప్రైమరీ)ని ఏర్పాటు చేసేందుకు రూ.ఐదు వేల కోట్లు ప్రత్యేక గ్రాంటు ఇవ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోడీకి శనివారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలో 95 శాతం తల్లిదండ్రులు వారి పిల్లలను మూడేండ్లు నిండగానే పూర్వ ప్రాథమిక తరగతుల్లో చేర్చుతున్నారని తెలిపారు. ఆ తరగతుల కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని కేంద్ర ప్రభుత్వం చెప్తున్నదని పేర్కొన్నారు. వాటిలో ఒక్క గది మాత్రమే ఉంటుందని వివరించారు. కొన్నిచోట్ల స్వంత భవనాల్లేక కిరాయి గదుల్లో నడుపుతున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రానికి గర్భిణీ స్త్రీలు, బాలింతలు, మూడేండ్ల నుంచి ఆరేండ్ల మధ్య వయస్సు గల బాల, బాలికలు రావాలని పేర్కొన్నారు. ఆ గదిలోనే వంట కూడా చేయాలని వివరించారు. అంగన్‌వాడీ టీచర్ ఒక్కరే అందరినీ చూసుకోవాలని తెలిపారు. ఈ కారణాల వల్ల ఆయా కేంద్రాలను తల్లిదండ్రులు పూర్వ ప్రాథమిక కేంద్రాలుగా పరిగణించడం లేదని స్పష్టం చేశారు. దీనివల్ల వారు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ వేల రూపాయలు వెచ్చించి మూడేండ్లు నిండగానే ప్రయివేటు పాఠశాలలకు పంపించాల్సి వస్తున్నదని తెలిపారు. తద్వారా వారు అప్పులపాలవుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, మండల పరిషత్, గిరిజన సంక్షేమ పాఠశాలలు 18 వేల వరకున్నాయని తెలిపారు. వాటిలో పదివేల ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతుల ఏర్పాటు కోసం రూ.ఐదు వేల కోట్లు ప్రత్యేక గ్రాంటును తెలంగాణ రాష్ట్రానికి విడుదల చేయాలని నర్సిరెడ్డి కోరారు.

హైదరాబాద్‌లో పెరిగిన గృహ అమ్మకాలు

హైదరాబాద్ : నగరంలో గృహాల అమ్మకాలు పెరిగాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్‌ఫ్రాంక్ ఇండియా తెలిపింది. ప్రస్తుత ఏడాది మార్చిలో హైదరాబాద్‌లో రూ.3,352 కోట్ల విలువ చేసే నివాసాల అమ్మకాలు జరిగాయని తెలిపింది. మొత్తంగా 6,414 గృహాలు రిజిస్టర్ అయ్యాయని.. ఇంతక్రితం నెలతో పోల్చితే 12 శాతం పెరుగుదల చోటు చేసుకుందని పేర్కొంది. 2022 మార్చి మాసం అమ్మకాలతో పోల్చితే మాత్రం 5 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. విలువ పరంగా 7 శాతం పెరుగుదల నమోదయ్యింది. ఇందులో హైదరాబాద్, మెడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని నివాసాల అమ్మకాలను పరిగణలోకి తీసుకుని ఈ రిపోర్ట్‌ను రూపొందించింది. మొత్తం రిజిస్ట్రేషన్లలో రూ.25 లక్షల దిగువన ఉన్నవి 19 శాతం కాగా.. రూ.25-50 లక్షల మధ్య నివాసాలు 55 శాతంగా ఉన్నాయి.

సింక్రోనీ బాస్ హైదరాబాద్ పర్యటన

హైదరాబాద్ : దిగ్గజ కన్స్యూమర్ ఫైనాన్సియల్ కంపెనీ సింక్రోనీ ప్రెసిడెంట్ బ్రియాన్ డబుల్స్ హైదరాబాద్‌లో పర్యటించారు. నగరంలోని సలార్‌పురియా సత్వ నాలెడ్జ్ సిటీలో ఐక్యతకు చిహ్నంగా మైక్రోకార్ప బోన్సాయ్‌ను నాటారు. ఆయనతో పాటు సలార్పురియా సత్య నాలెడ్జ్ సిటీ జిఎం సుధాన్షు భరద్వాజ్, సింక్రోనీ ఇండియా ఫైనాన్స్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ కంభంపాటి, ఎస్‌విపి బిజినెస్ లీడర్, ఆండీ పొన్నేరి తదితరులు ఉన్నారు.

మెడికవర్ హాస్పిటల్‌లో 'అందరికీ ఆరోగ్యం'

హైదరాబాద్ : ఆరోగ్య సంరక్షణ సమస్యలపై అవగాహన, మద్దతును పెంచడానికి ప్రతీ ఏడాది ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మెడికవర్ హాస్పిటల్ 'అందరికీ ఆరోగ్యం' కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం 75వ వార్షికోత్సవం సందర్భంగా ఈ థీమ్ తీసుకున్నట్లు పేర్కొంది. దఢమైన ఆరోగ్యం కోసం పూర్వీకుల ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాట్లను గుర్తించి, అనుసరించేలా ప్రజలను ప్రోత్సహించడానికి "బ్యాక్ టు ది రూట్స్" అనే థీమ్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపింది. దీనిపై శుక్రవారం ఓ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొంది. ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ సిఎండి సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ అనిల్ కృష్ణ మాట్లాడుతూ.. "ఆధునిక వైద్యంలో ప్రయోజనాలు ఉన్నాయి, అయితే ఆరోగ్యంగా ఉండేందుకు సహజసిద్ధమైన నివారణలు, సాధారణ జీవనశైలి మార్పులపై ఆధారపడిన మన పూర్వీకుల నుంచి మనం చాలా నేర్చుకోవచ్చు." అని పేర్కొన్నారు.

నిరసన కార్యక్రమాలపై నిర్బంధం

- ప్రధాని రాక సందర్భంగా అడుగడుగునా నిఘా
- సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

శనివారం హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం (సత్యనారాయణ రెడ్డి భవన్) చుట్టూ పోలీసులు వందలాదిగా మోహరించారు. ప్రధాని మోడీ శనివారం హైదరాబాద్ పర్యటన సందర్భంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సిపిఐ రాష్ట్ర సమితి పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు అక్కడ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. నిరసన తెలిపేందుకు అనుమతి లేదని నిరాకరించారు. సిపిఐ శ్రేణులు నలువైపులనుంచి అకస్మాత్తుగా దూసుకొచ్చి పోలీసుల వలయాన్ని చేధించుకుని అక్కడ ప్రదర్శన నిర్వహించారు. ప్లకార్డులు చేతబూని 'మోడీ హటావో - దేశ్‌కీ బచావో, మోడీ గో బ్యాక్, నిరంకుశ బిజెపి నశించాలి, విభజన హామీలు అమలు చేయాలి..అంటూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. పోలీసుల ప్రదర్శనను అడ్డుకోవడానికి ప్రయత్నించటంతో వారి మధ్య తీవ్ర వాగ్వాదం, ఉద్రిక్తత నెలకొన్నాయి. పోలీసులకు కార్యకర్తలకు మధ్య కాసేపు తోపులాట జరిగింది. అనంతరం ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఎనిమిదేండ్ల కాలంలో ఏ ఒక్క విభజన హామీలను అమలు చేయని ప్రధాని మోడీ రాష్ట్రంలో అడుగుపెట్టడం సిగ్గుచేటని విమర్శించారు.కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి. నరసింహా, వి.ఎస్.బోస్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి బి. వెంకటేశం పాల్గొన్నారు.

రూ.23 లక్షల కోట్ల ముద్రా రుణాల జారీ

- మంత్రి సీతారామన్ వెల్లడి

న్యూఢిల్లీ : గడిచిన ఎనిమిదేళ్లలో రూ.23.2 లక్షల కోట్ల ముద్రా రుణాలు జారీ చేయడం జరిగిందని ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. చిరు వ్యాపారుల కోసం ఉద్దేశించిన ముద్రా పథకం ప్రారంభించి ఎనిమిదేళ్లు అయ్యిందన్నారు. ఇప్పటి వరకు దీని వల్ల 40.82 కోట్ల మంది లబ్ధి పొందారన్నారు. కొత్తగా వ్యాపారం చేయాలనుకునే వారికి, వ్యాపార విస్తరణకు ఆర్థిక చేయూతను అందించేందుకు రూ.10 లక్షల వరకు తనఖా లేని రుణాలను అందించేందుకు సరిగ్గా ఎనిమిదేళ్ల క్రితం దీన్ని ఏర్పాటు చేశారు. రుణాల పొందిన వారిలో 51 శాతం మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాల వారున్నారని మంత్రి పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆధ్వర్యంలో 12న ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంజాన్ పండుగను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతీయేటా అధికారికంగా నిర్వహించే ఇఫ్తార్ విందును ఈనెల 12న నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే ఈ విందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలంటూ సిఎం కెసిఆర్...తన కార్యదర్శి భూపాల్‌రెడ్డిని ఆదేశించారు.

బిగాస్ నుంచి ఇవి సి12 విడుదల

హైదరాబాద్ : బిగాస్ ఆటో కొత్తగా సి12 స్కూటర్‌ను విడుదల చేసింది. ఇప్పటికే డి15, బి8, ఎ2 ఇవిల విజయ బాటలో సి12ను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఈ ప్రీమియం స్కూటర్ అత్యంత శక్తివంతంగా ఉండటంతో పాటుగా ఆకర్షణీయంగా, అత్యంత అందుబాటు ధరలో లభ్యం కానుందని తెలిపింది. 20కు పైగా భద్రతా ఫీచర్లతో దీన్ని ఆవిష్కరించినట్లు వెల్లడించింది. ఒక్క సారి ఛార్జింగ్‌తో 143 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని తెలిపింది. దీని పరిచయ ధరను రూ.97,999గా ప్రకటించింది.

రూ.85వేల కోట్ల మొబైల్ ఫోన్ల ఎగుమతి

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2022-23)లో భారత్ నుంచి రూ.85,000 కోట్ల విలువ చేసే మొబైల్ ఫోన్ల ఎగుమతులు జరిగాయని ఇండియా సెల్యూలర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసిఇఎ) వెల్లడించింది. ఉత్పత్తి ప్రోత్సాహక అనుసంధాన పథకం వల్ల ఈ రంగానికి మద్దతు లభించిందని తెలిపింది. స్థూల ఎగుమతుల వృద్ధితో పోల్చితే స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు రెట్టిపు అయ్యాయి. ముఖ్యంగా యుఎఇ, అమెరికా, నెథర్లాండ్స్, బ్రిటన్, ఇటలీ దేశాలకు ఎక్కువ ఎగుమతులు జరుగుతున్నాయని ఐసిఇఎ తెలిపింది. భారత మొబైల్ ఎగుమతుల్లో ఈ ఐదు దేశాలు తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయని పేర్కొంది. దేశంలో అమ్మకాలు జరుగుతున్న మొత్తం స్మార్ట్‌ఫోన్లలో 97 శాతానికి పైగా భారత్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.1 లక్ష కోట్ల ఎగుమతులు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఐసిఇఎ తెలిపింది.

రస్నా సృష్టికర్త

అరీజ్ ఫిరోజ్‌కు పద్మశ్రీ పురస్కారం

హైదరాబాద్ : రస్నా గ్రూపు వ్యవస్థాపకుడు, ఛైర్మన్ దివంగత అరీజ్ ఫిరోజ్ షా ఖంబాటాకు ఎట్టకేలకు పద్మశ్రీ పురస్కారం దక్కింది. ఆయన మరణాంతరం ఈ అవార్డు పొందారని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. వాణిజ్యం, పరిశ్రమల రంగంలో ఆయన సేవలకు గాను ఈ అవార్డు పిరోజ్ తరపున ఆయన భార్య పెర్సిస్ అరీజ్ ఖంబాటా, కుమారుడు పిరుజ్ అరీజ్ ఖంబాటా రాష్ట్రపతి చేతుల మీదుగా స్వీకరించారు.

కల్తీ కల్లు తాగి 10 మందికి అస్వస్థత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కల్తీ కల్లు తాగి పదిమంది అస్వస్థతకు గురైన సంఘటన మహబూబ్‌నగర్ పట్టణ శివారులో ఉన్న దొడ్డలోనిపల్లిలో శనివారం జరిగింది. జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జీ డాక్టర్ శిరీష, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దొడ్డలోనిపల్లి, మోతీనగర్, కోయనగర్ ఇతర ప్రాంతాలకు చెందిన కూలీలు రోజు కూలి చేసుకుంటూ జీవిస్తున్నారు. కొంతమంది పని పూర్తయిన తర్వాత కల్లు తాగుతుంటారు. ఈ నేపథ్యంలో శనివారం కల్లు తాగుతున్న సమయంలో పదిమంది కూలీలు అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కల్లులో డోస్ ఎక్కువగా ఉండడం, కల్తీ అయి ఉంటుందని జిల్లా ఆస్పత్రి ఇన్‌చార్జీ తెలిపారు. అందులో నలుగురు పరిస్థితి కొంత విషమంగా ఉన్నా.. ఎవరికి ఎలాంటి ప్రాణహాని లేదని శిరీష తెలిపారు. కల్తీ కల్లు సరఫరా చేస్తున్న వారిమీద ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

హైదరాబాద్ నల్లకుంటలోని ఐరా డయాగ్నోస్టిక్ సెంటర్ మొదటి వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించింది. అన్ని టెస్టులు అందుబాటులో ఉంటాయని డాక్టర్ హరీష్ తెలిపారు.స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొన్నారు. (ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో)